వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
సోమవారం 22 జూన్ 2026





## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం ఎంపీ



పులివెందుల / వేముల , జూన్ 21, ప్రభాతవార్త :

పులివెందుల నియోజక వర్గంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పులివెందుల పట్టణంలోని తన నివాసంలో ప్రజలను కలిసి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా, వాటిని సావధానంగా విన్న ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తదుపరి వేముల మండలం భూమయ్యగారి పల్లి గ్రామ పరిధిలోని గట్టు వద్ద నూతనంగా నిర్మించిన నరసింహ స్వామి ఆలయ ప్రారంభ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంలాంటిదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని 14మంది లబ్ధిదారులకు సిఎం సహాయనిధి కింద రూ.14.50లక్షలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల ఆరోగ్య సంరక్షణ కోసం సిఎం సహాయనిధి కింది నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వ్యాధులకు లోనైన వారు కార్పొరేట్ ఆసుపత్రిల్లో చికిత్సలు పొందిన అనంతరం బిల్లులను సమర్పిస్తే సిఎం సహాయనిధి కింద నిధులు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. తొలుగ ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజాధర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

# పీలేరులో కల్తీ పాపాల భైరవులు

- జోరుగా కల్తీ పాల వ్యాపారం
- పసిపిల్లల ఆరోగ్యానికి చేటు
- నిద్రావస్థలో కల్తీనిరోధక శాఖాధికారులు
- కల్తీ పాలతో పెరుగుతున్న రోగాలు



కల్తీ పాలలో కలపడానికి తయారు చేస్తున్న పౌడర్

పీలేరు, జూన్ 21 ప్రభాతవార్త ::

పీలేరు శివారు ప్రాంతాల్లో కల్తీపాల వ్యాపారులు చెలరేగిపోతున్నారు. లక్షల్లో లంచాలు తీసుకుంటున్న కల్తీ నిరోదకశాఖాధికారులు పాల వ్యాపారులతో మమేకమై పాపాలు చేస్తున్నారు. పట్టణానికి చెం దిన శివారు ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలను ఎంచుకొని ఈ కల్తీ పాలను తయారు చేసి అమ్ముతున్నారు. అవి చూడడానికి, తాగ డానికి మామూలు పాలగానే ఉన్నా 48గంటలు గడిచిన తరువాత వాటి ప్రభావం కనపడుతుంది. ఇదివరలో ఇలాంటి కల్తీవ్యాపారుల ను అధికారులు పట్టుకొన్నా వారిపై సరైన రీతిలో కేసులు నమోదు చేకపోవడంతో అడ్డుగోలుగా ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఇక్కడ పాలు తీసుకొని టి దుకాణాల్లోకూడా కలిపివేస్తున్నారు. ఇలాంటి పాలు లేదా టి తాగాలంటే భయంవేస్తుందని ప్రజలు చెబుతున్నారు. ఇలాంటి కల్తీ పాలను తయారు చేసే వారిని కొందరు తక్కువ రేటుకు పాలు లభిస్తున్నాయన్న నెపం తో వ్యాపారస్తులు ప్రోత్సహిస్తున్నారు. కల్తీలకు ప్పాలడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ పరిస్తితి ఎంతవరకు చేరిందంటే గ్రామాల్లో ఇంటింటా పాలను విక్రయించే వ్యాపారులు కూడా అనుసరిస్తుండడం ఆంద్ళన కలిగిస్తోంది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పాలను కల్తీ చేస్తున్నారు. తాగా మరో విషయం వెలుగు చూసింది. గాడిద కొవ్వును ఆయల్‌గా మార్చి దాని పాలలో కలిపి కొంతమంది వాటిని డెయిరీలకు విక్రయిస్తున్న ట్లు సమాచారం. స్వచ్ఛమైన పాలతో వచ్చిన వెన్న తీసిన తరువాత ఆ పాలను వ్యాపారులు పలు డెయిరీలకు పంపుతున్నారు. అక్కడ శాతం ఎక్కువగా రావడానికి కొవ్వునుంచి తీసిన నూనెను కలుపు తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిని కలపడం ద్వారా పాలలో శాతం పెరుగుతున్నట్లు కొంతమంది ఘరానా వ్యాపారులు గుర్తిం చారు. ఈ ప్రభావం మరింత ప్రమాదకరంగా మారింది. చిన్నపిల ్లలకు జబ్బులు, గర్భస్రావాలు ఎక్కువగా ఉన్న పలువురు స్త్రీలను పరిశీలిస్తే వీరు ఎక్కువగా బయట మార్కెట్‌లో లభించే వివిద రకాల పాలను విరివిగా వాడటం వల్ల కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని గుర్తించినట్లు తెలుస్తోంది. గాడిద కొవ్వును పాలలో కలపడం, అవి వాసన రాకుండా ఉండడానికి గానూ అందులో కొద్దిశాతం యూరియా నీటిని కలుపుతున్నారు. ఈ మిశ్రమం వల్ల రెండు రోజులు పాటు పాలలో ఎలాంటి మార్పు రాదు ఎక్కువమంది వినియోగదారులు ఫ్రిజ్‌లలో డీప్‌లలో నిల్వ చేయడం వల్ల కల్తీల నిజస్వరూపాన్ని గుర్తించలేక పోతున్నారు. ఇటీవల గేదె పాలల్లో ఇలాంటి కల్తీని కలుపుతున్నట్లు ఇక్కడ అధికారులు గుర్తించి తీవ్రమైన ఆందోళన చేశారు. హానికరమైన పాలను పలు వైద్యశాలల్లో రోగులకు పంపిణీ చేస్తున్నారన్న విషయం కల్తీపాలను తయారుచేసే వ్యక్తుల వ్యవహారం కొంతమంది ఫుడ్‌కంట్రోల్ విభాగం అధికారులకు తెలిసినా తెలియనట్లు కళ్ళు, ముక్కులు మూసుకొన్నారన్న విమర్శలు ఉన్నాయి. పీలేరు శివారు ప్రాంతాల్లో ఇలాంటి ముఠాను కనుగొని పాలను ఢిల్లీ సెంట్రల్ ఫుడ్ కంట్రోల్ విభాగం అధికారులకు పంపి పరిశీలిస్తే అధికంగా ఉన్న ఆమ్లాలు, వెన్న, నెయ్యి వంటి వాటి బదులు ఆనారోగ్యం పాలు చేసే కొన్ని రకాల నూనెల కల్తీ అందులో ఉన్నట్లు గుర్తించవచ్చు. దీనిపై ఫిర్యాదులు చేసినా ఈ ప్రాంతాల్లో ఉన్న కంటోల్ విభాగం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనుక పెద్ద ఎత్తున మామూళ్ళ కథ నడుస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల వద్దనుంచి సేకరించిన పాలను మిషన్ ద్వారా వచ్చిన వెన్నను తీసి మళ్ళీ శాతం పొంది సొమ్ము దండుకోవాలనే ఆలోచనలతో ఇలాంటి కల్తీని యదేచ్ఛగా ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం పాడి గెదెలను పెంచడం కష్టతరంగా ఉండటం, పాలకు సరైన గిట్టుబాటుధర లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కొంత మంది వ్యాపారులు కల్తీ పాలను తయారు చేసి జోరుగా విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. ఇక్కడ గాడిద కొవ్వును పాలల్లో కలుపుతుండడంతో పాలపై కొవ్వు 24గంటల తరువాత తేలుతూ నూనెలా కనపడుతోంది. ఈ నూనెలను గుట్టుచప్పుడు కాకుండా పాలలో కలుతుండడంతో పాలలో ఉన్న పోషక విలువలు కలిగిన పాల కూడా కల్తీకి గురవుతున్నాయి. పలువురు అక్రమార్కులు చర్యల వల్ల ప్రజారోగ్యం పాడవుతోంది. ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తూ ప్రాణాలకే ముప్పు తెస్తున్నారు. వివిధ కల్తీపదార్థాలు రసాయనాలతో కృత్రిమ పాలను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారు. పాలకు ఉన్న డిమాండ్‌ను అక్రమాక్కులు సొమ్ము చేసుకొంటున్నారు. ఇంత తంతు సాగుతున్నా జిల్లా యంత్రాంగం, ఇటు కల్తీ నిరోధక శాఖ, తూనికలు, కొలతల శాఖలు మొద్దునిద్ర వీడడం లేదు. వీరి నిర్వాహకం, నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చాపకింద నీరులా పాల కల్తీ బాగా పెరిగింది. ఇలాంటి కల్తీ పాలను తాగడం వల్ల వాంతులు, విరేచనాలతో పాటు కాలేయం, గుండె, క్యాన్సర్ వంటి దీర్ఘకాలకి వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రైవేటు పాల వ్యాపారులు కొందరు కొన్ని గ్రామాల్లో బల్క్ కూలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలోనే కల్తీ ఆరంభం అవుతోంది. అత్యధిక పాలు ఇవ్వడానికి ఉపయోగించే ఆక్సిటోసిన్ అనే నిషేధిత సూది మందను పాడి పశువులకు ఇస్తున్నారు. ఇలాంటి పాలు నేరుగా ప్రజలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ..మిగతా 2వ పేజీలో

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

రాజంపేట, జూన్ 21 ప్రభాతవార్త

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారిలో యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీ ‌ ‌ ‌ ‌ ‌ మ్రనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమానికి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ప్రశాంతత జీవన సాధ్యమవుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగా చేస్తూ ఆనందంగా ఉండాలని, అంతేకాకుండా యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, డాక్టర్ నవీన్, ఏఈ మల్లేశ్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్ రాజు

## ఇసుక క్వారీ గుంతలో పడి
# ఇద్దరు యువకులు దుర్మరణం







వేంపల్లి : జూన్ 20 ప్రభాతవార్త:

చక్రాయపేట మండలం కుమారకాలవ పాపాగ్ని నదిలోని ఇసుక క్వారీ గుంతలో పడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వీరు పెండ్లిమర్రి మండలం కార్పురెడ్డి గారి పల్లెకు చెందిన రాజవర్ధ న్ రెడ్డి (16), జయంతి రెడ్డి (18)గా గుర్తించారు. బంధువుల ఇంటికి వచ్చి సరదాగా ఇసుక క్వారీ వద్దకు వెళ్లిన యువకులు నీటిలో ఈత ఆడదామని నీటిలోకి దిగగా ఊబిలో చిక్కుకొని మృతి చెందడంతో గ్రా మంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాల వల్లే తమ పిల్లలు చనిపోయారంటూ క్వారీ వద్ద గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మృతదేహాలతో పాపాగ్ని నదిలో గ్రామ స్తుల ఆందోళన, క్వారీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు, అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసు నమోదు చేయాలని గ్రామ స్తులు డిమాండ్ చేశారు.

## యోగాను జీవితంలో భాగం చేయడమే
# ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు**

**యోగాతో సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం , జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**





మదనపల్లె, కడప, జూన్ 21 ప్రభాతవార్త :

యోగాంధ్ర కార్యక్రమం ద్వారా యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెకటర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు తెలిపారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆదివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పట్టణంలోని మిషన్‌కాంపౌండ్ మైదానంలో సుమారు 1600 మంది పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరింపచేశారు. అనంతరం యోగా శిక్షకులు డాక్టర్ పాల్ బ్రహ్మకుమార్ ఆధ్వర్యంలో సుమారు గంటపాటు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాను కేవలం ప్రత్యేక రోజుల్లో చేసే కార్యకలాపంగా కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్‌భాగంగా మార్చాలన్నదే ప్రధాన లక్ష్యం అన్నారు. గత నాలుగు వారాలుగా యోగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తాయి వరకు యోగా చైతన్యాన్ని తీసుకెళ్ళే ఉద్దేశంతో యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 3.10లక్షలకు పైగా యోగాభ్యాసానికి నమోదు కావడం విశేషం అన్నారు. యోగాను నిరంతర జీవనశైలిగా అలవాటు చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలన్నారు. జిల్లా ఎస్పి దీరజ్‌కనుబిల్లి మాట్లాడుతూ యోగా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగం అన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు, వ్యాయామం, ఈతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ ఉదయం కొంతసమయం శారీరక వ్యాయామం లేదా ఇష్టమైన క్రీడకు కేటాయించాలని సూచించారు. సెటిల్, హాకీ, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో పాల్గొనడం వల్ల రోజంతా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. యోగా కార్యక్రమం విజయవంతం అయినందుకు అందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లాకళ్యాణి, ఏఎస్‌పి వెంకటాద్రి, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, డిఎస్‌పి పావని, ఆర్డీఏ పీడి నాగేశ్వర్‌రావు, బిడిఓ లక్ష్మీపతి, డిఈఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ మాధవి, జిల్లా స్తాయి అధికారులు పాల్గొన్నారు.

**కడప హాకీ గ్రౌండ్ ,మున్సిపల్ స్టేడియంలో**

మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే.. ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం సిద్ధించడంతో పాటు.. మానసిక వికాసం మన సొంతం అవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు ఆదివారం ఉదయం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు యోగా గురువు బాబా రాం దేవ్ పాల్గొన్న కార్యక్రమం ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ.. జిల్లా స్థాయిలో కడప హాకీ గ్రౌండ్ ,మున్సిపల్ స్టేడియం లో యోగాంధ్ర 2026 ముగింపు కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది. కడప నగరపాలక సంస్థ, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగా" కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ డా.నిధీమీనా, కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్. భావన, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకుని నిర్వహించిన ఈ యోగా కార్యక్రమానికి పెద్ద ఎత్తున నగర పౌరులు హాజరై యోగాసనాలు వేయడం.. శుభపరిణామం అన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన మన దేశ ప్రధాని మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భారత దేశ ఖ్యాతిని, సనాతన ధర్మాన్ని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాలను, ఆరోగ్య సూత్రాలను దేశ ప్రజలకు, భవిష్యత్ తరాలకు అందించాలనే సత్ సంకల్పం తో 12 ఏళ్లుగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నినిర్వహిస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు యోగాంధ్ర 2026 కార్యక్రమం నువివిధ రకాల థీములతో నిర్వహించడం జరిగిందన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

# విజయవాడ సన్ షైనర్స్ విధ్వంసం

**20 ఓవర్లలో 290 పరుగుల భారీ స్కోరు**
**కెప్టెన్ అశ్విన్ హెబ్బార్, అభినవ్ మెరుపు సెంచరీలు..**
**కాకినాడ బౌలర్లకు చుక్కలు**
**తొలి మ్యాచ్ లో రాయలసీమ రాయల్స్‌కు ఘన విజయం**
**బౌలింగ్‌లో మెరిసిన అజయ్ కుమార్**

కడప, స్పోర్ట్స్ ,జూన్ 20 , ప్రభాత వార్త :

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్5లో రాయలసీమ రాయల్స్ జట్టు విజయ ఢంకా మోగించింది. వైఎస్సార్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన 19వ మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన రాయలసీమ రాయల్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన తుంగభద్ర వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. జట్టులో కే.ఆనంద్ జోసయ్య 38 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. రాయల్స్ బౌలర్లలో కే. అజయ్ కుమార్, జీ. పార్థసారథి అద్భుతంగా బౌలింగ్ చేసి చెరో మూడు వికెట్లు పడగొట్టారు. పార్థసారథి 3 వికెట్లకు 20 పరుగులు ఇవ్వగా, అజయ్ కుమార్ 3 వికెట్లకు 26 పరుగులు మిగతా 4వ పేజీలో




మంత్రి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకుంటున్న దృశ్యం

# జిల్లాలో ప్రశాంతంగా రీనీట్ పరీక్ష..!..

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి..

కడప, జూన్ 21, ప్రభాతవార్త :

జిల్లాలో ఆదివారం నిర్వహించిన రీనీట్ (యూజీ)2026 పరీక్ష ప్రశాంతంగా వాతావరణం లో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. జిల్లా లో రీనీట్-2026 పరీక్షకు మొత్తం 3,148 మంది అభ్యర్థులు కేటాయించగా, వారిలో 2,883 మంది హాజరై 91.58 శాతం హాజరు నమోదయిందన్నారు. కాగా 265 మంది అభ్యర్థులు గైర్హాజరై 8.42 శాతం గైర్హాజరయినట్లు తెలిపారు. ప్రతి కేంద్రానికి ప్రత్యేక ప్రధాన పర్యవేక్షకులు, ఉన్నత విద్యాశాఖ అనుసంధాన అధికారులు, నగర సమన్వయ అధికారులు, కేంద్ర భద్రతా బలగాల ప్రత్యేక పర్యవేక్షణ లో పరీక్ష సజావు గా ముగిసిందన్నారు. ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రి రవాణా కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, వైద్య సహాయం, రవాణా, భద్రత తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, పోలీసు శాఖ, కేంద్ర భద్రతా బలగాల సమన్వయం తో పరీక్ష విజయవంతంగా నిర్వహించబడిందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణను నిరంతరం పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా అన్ని పరీక్షా కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు తెలిపారు. భద్రత, వైద్య, విద్యుత్ తదితర అత్యవసర అంశాలపై తక్షణ స్పందన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినందున పరీక్ష సజావుగా జరిగిందన్నారు. పరీక్ష నిర్వహణ లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల పరీక్ష విజయవంతంగా పూర్తైందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయన్నారు.



# అల్ ఇండియాయూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్‌లో ఐఐటీ విద్యార్థి ప్రతిభ



వేంపల్లి, జూన్ 21, ప్రభాత వార్త : ఆర్కే వ్యాలీ పిఎల్ బృందానికి చెందిన పూర్వ విద్యార్థి, డాక్టర్ బాల్‌గోవింద్ తివారీ శిక్షణలో ఉన్న డి. మురళీ కృష్ణ ఈ నెల ప్రారంభంలో హిందుస్థాన్ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 59 కేజీల విభాగంలో రజత పతకాన్ని గెలుచుకున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. విద్యార్థుల అందించిన ప్రతిభ ఆ యూనివర్సిటీ డైరెక్టర్ విజయ్ ప్రకాష్ అధ్యాపకులు అభినందించారు, పైన పేర్కొన్న పోటీలో ఆయన యోగి వేమన విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు.

## రాయచోటికి చెందిన వ్యక్తి మదనపల్లెలో అదృశ్యం

ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి



మదనపల్లెక్రైం, జూన్ 21 ప్రభాతవార్త. రాయచోటికి చెందిన ఓ వ్యక్తి మదనపల్లెలో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం రాయచోటి నివాసి అయిన బాసివిగళ్ల రవి శేఖర్ (58) నెల రోజుల క్రితం మదనపల్లెకు వచ్చిన సమయంలో అదృశ్యమయ్యారు. అప్పటినుంచి ఆయన కోసం కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లోనూ గాలిస్తున్నప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు రవి శేఖర్‌కు సంబంధించి ఎలాంటి చిన్న సమాచారం ఉన్నా, లేదా ఈ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే 81253 97082, 78934 50677 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



ముద్దనూరు, జూన్ 21 ప్రభాతవార్త: మండలంలోని గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన వెన్నపూస సూర్యనా రాయణ రెడ్డి (58) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యనారాయణ రెడ్డి సుమారు ఐదేళ్ల క్రితం పక్షవాతం బారిన పడి చేయి, కాలు పనిచేయకుండా పోయాయి. అనంతరం చికిత్స పొందుతూ కొంత మేర కోలుకున్నప్పటికీ, పది రోజుల క్రితం మళ్లీ పక్షవాతం రావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 22న కౌన్సిలింగ్

ఎడ్యుకేషన్, జూన్ 21, ప్రభాతవార్త : ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన డీఎస్సీ 2008 మరియు డీఎస్సీ 1998 మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల పోస్టింగ్ల కేటాయింపు కోసం ఈ నెల 22వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటన ప్రకారం, కౌన్సిలింగ్ 22.06.2026 సోమవారం రోజున కడపలోని రిమ్స్ రోడ్డులో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణలో జరుగుతుంది. కౌన్సిలింగ్ ప్రక్రియ మొత్తం ప్రభుత్వం మరియు పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా నిర్ణీత సమయానికి హాజరై పోస్టింగ్ కేటాయింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు నిర్ణీత తేదీ, సమయానికి కౌన్సిలింగ్‌కు హాజరుకాని ఉపాధ్యాయులకు తదుపరి ఎటువంటి కౌన్సిలింగ్ అవకాశం కల్పించబోమని విద్యాశాఖ హెచ్చరించింది. అలాగే, హాజరుకాని ఉపాధ్యాయులకు అనంతరం పోస్టింగ్ ఉత్తర్వులు కూడా జారీ చేయబడవని తెలిపింది. కావున సంబంధిత ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా కౌన్సిలింగ్‌కు హాజరై తమ పోస్టింగ్‌లను పొందాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన అధికారులు



ముద్దనూరు, జూన్ 21, ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముద్దనూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎండిఓ రాధాకృష్ణవేణి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం యోగా నిపుణుల ఆధ్వర్యంలో వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి, పాల్గొన్న వారితో సాధన చేయించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్‌బాబు పోలీసు సిబ్బందితో కలిసి పాల్గొని యోగా సాధన చేశారు. అలాగే పట్టణానికి చెందిన ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భూ వివాదంతో ఇరు వర్గాల ఘర్షణ

మదనపల్లెక్రైం, జూన్ 21 ప్రభాతవార్త: భూ వివాదంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన తండ్రి, కుమారుడితో పాటు మరో వర్గానికి చెందిన ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఎనమలవారిపల్లెకు చెందిన సునీల్ కుమార్, త్రిలోక్ కుమార్ కుటుంబాల మధ్య భూ వివాదం జరుగుతోంది. శనివారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో త్రిలోక్ కుమార్ తీవ్రంగాగాయపడగా, సునీల్ కుమార్‌కు స్వల్ప గాయాలైయాయి. గాయపడిన బాధితులను కుటుంబీకులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. అనంతరం ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై చంద్రమోహన్ కేసు విచారణ చేస్తున్నారు.

## రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీగా మునిగోపాలక్రిష్ణ

మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :



ఎన్నికైన కార్యవర్గసభ్యులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా బివి.రమణ, జనరల్ సెక్రటరీగా డాక్టర్ మునిగోపాలక్రిష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం పట్టణంలోని జిఆర్‌టి ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గురురాజారావు, ఉపాధ్యక్షులు జయరామనాయుడు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ట్రెజరర్‌గా బిసి తిమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జగన్‌మోహన్, అసోసియేట్ అధ్యక్షులుగా సిపి శ్రీనివాసులు, రాజన్న, ఉపాధ్యక్షులుగా శంకుతల, శివప్రసాద్, సుబ్బరాజు, సెట్రకరీగా సరస్వతి, మక్బుల్‌బాషా, గౌస్‌బాషా, ఈసిసభ్యులుగా ధనలక్ష్మి, జయంతిలతో పాటు పలువురిని ఎన్నుకొన్నారు. ఈసందర్భంగా జనరల్ సెక్రటరీ డాక్టర్ మునిగోపాలక్రిష్ణ మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, శంకరయ్య, కేశవరెడ్డి, సుబ్రమణ్యంలకు అభినందనలు తెలిపారు.

# రాజంపేట ప్రజలకు చేతనైన మేర ఉచిత వైద్య సేవలు

డాక్టర్ మాలేపాటి మారుతి కృష్ణ



మారుతి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సిఐ లింగప్ప, డాక్టర్ మారుతి కృష్ణ

రాజంపేట, జూన్ 21 ప్రభాతవార్త రాజంపేటలో పుట్టి పెరిగిన తాను ఈ ప్రాంత ప్రజలకు చేతనైన మేర ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తిరుపతి శ్రీ మారుతి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాలేపాటి మారుతి కృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక మన్నూరు జడ్పీ హైస్కూల్లో శ్రీ మారుతి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని మన్నూరు సిఐ లింగప్ప ప్రారంభించారు. రాజంపేటకు చెందిన డాక్టర్ మారుతి ఇక్కడే పుట్టి పెరిగి ఉచితంగా ప్రజలకువైద్య సేవలు ప్రజలు అందించాలని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి వైద్య సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 250 మంది ప్రజలు ఉచితంగా వైద్య సేవలు అందుకున్నారు. ఈసీజీ, 2డిఏకో , బోన్ టెస్ట్ , షుగర్, బీపీ టెస్ట్ లు నిర్వహించారు. అనంతరం మారుతి హాస్పిటల్స్ ఫౌండర్ మాలేపాటి రామకృష్ణ నాయుడు,మన్నూరు సిఐ లింగప్ప ,మన్నూరు హై స్కూల్ హెచ్‌ఎం పరిమళాను సన్మానించారు.ఈ వైద్య శిబిరంలో ఆర్థోసేవలను డాక్టర్ మారుతి క్రిష్ణ, ఉద్యోగులను డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి , ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు డాక్టర్ శ్రీరామరాజు, న్యూరాలజీ నిపుణులు కోన చిరంజీవి, ఇంకా డాక్టర్ అనూష, డాక్టర్ పవన్, డాక్టర్ ప్రణయ్, సిబ్బంది ప్రజలకు సేవలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పైగా రోగులకు 3,500 విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# యోగాతో శారీరక మానసిక ఆరోగ్యం

ఎంపీడీవో కుళ్లాయమ్మ



వేంపల్లి:జూన్ 21 ప్రభాతవార్త మనిషి ఆనందంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆలోచన, ఆచరణ సమంగా ఉంటూ, జీవితంలో ఎదగడానికి అవకాశం ఉందని, అందుకు యోగ అవసరమని ముఖ్యంగా విద్యార్థులకు ఆసనాలు, ధ్యానం మానసిక శారీరక దృఢత్వాన్ని ఇచ్చి చదువులో ఎంతో ముందుకు వెళ్ళడానికి దోహదం అవుతుందని ఆమె అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు స్థానిక స్వామి వివేకానంద ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మండల విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటరామిరెడ్డి గారితో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు పలు యోగాసనాలు వేశారు . ఎంఈఓ వెంకటరామిరెడ్డి గారు మాట్లాడుతూ యోగాసనాలు, వ్యాయామం జీవితంలో ఎంతో అవసరమని దాని వల్ల దినచర్యలో కలిగే లాభాలను తన అనుభవాన్ని గుర్తు చేస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులకు తెలియజేశారు. కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుండి గత 25 సంవత్సరాలుగా విద్యార్థులకు యోగ ఒక అలవాటుగా చేస్తూ వస్తున్నామని, ఎంతో మంది పూర్వ విద్యార్థులు తమ జీవితంలో యోగాతో ఘన విజయాలను సాధించామని ఈనాటికీ తమ అనుభవాలను పంచుకుంటూ ఉంటారని తెలియజేశారు.పతంజలి మహర్షి రూపొందించిన సనాతన సాంప్రదాయం ఈనాడు ప్రపంచవ్యాపితం అయి ప్రపంచ ప్రజలకు ఆరోగ్యాన్ని ఆనందాన్ని పంచుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని యోగాసనాలను వేశారు.

## సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



గాలివీడు.జూన్ 21 ప్రభాతవార్త. సర్ ప్రక్రియ లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వై. కా.పా.మండల కన్వీనర్ మిట్టపల్లి యదు భూషణ్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం ఆయన గాలివీడు గ్రామంలో 190 వార్డులో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన ఓటర్లు తో మాట్లాడుతూ ఓటు తొలగించిన తర్వాత చేయించటం చాలా కష్టమని అందుకే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు కాపాడుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి. ఎల్.ఓ., బి.ఎల్.ఏ లు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామికి ధ్వజస్తంభం ప్రతిష్ట



సుండుపల్లె,జూన్ 21, ప్రభాతవార్త: మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం బహుద నది ఒడ్డుపై వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ ముందు భాగంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టత చేసినట్లు ఆలయ అర్చకుడు అచ్చన్న గారి. ఓబయ్య నాయుడు తెలియజేశారు. వివరాలకు వెళ్తే 21వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం ముందు భాగంలో ధ్వజస్తంభంను ప్రతిష్టత వేదమంత్రాల నడుమ ప్రతిష్ట చేయడం జరిగింది దాదాపుగా పురాతన కాలం ఆంజనేయ స్వామి దేవాలయం ఉన్నప్పటికీ తిమ్మసముద్రం గ్రామ దాతల సహాయంతో అ పురాతన దేవాలయం స్థానంలో నూతన ఆలయము ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



సుండుపల్లి,జూన్ 21,ప్రభాతవార్త : ఎన్డీయే కూటమి ప్రభుత్వంలోతలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు,వివిధ రకాల శాఖల ప్రభుత్వ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కూటమి నేతలతో కలిసి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో హాజరైన టిడిపి మండల సీనియర్ నాయకులు చప్పిడి. మహేష్ నాయుడు, జనసేనపార్టీ సీనియర్ నేత రామ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా అనేక రకాలుగా మెరుగుపడడంతో పాటుగా దృడంగా కూడా ఉంటుందని యోగాతో ఆరోగ్యం, జీవితంలో ఆనందం చూసేందుకు ఇటువంటి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చెయ్యడానికి అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కోరుతూ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## యోగాతో విద్యార్థులలో మానసిక ఉల్లాసం



పీలేరు, జూన్ 21, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని కేవీ పల్లి మండలంలోని గ్యారంపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చెన్నకేశవులు వివిధ ఆసనాలు విద్యార్థులతో చేయించారు. వాటితోపాటు యోగ ముద్రలు, సూర్య నమస్కారాలు, ధ్యానం నేర్పించారు. ధ్యానం ప్రతి రోజు చేయడం వలన ఒత్తిడి తగ్గి విద్యార్థులు విద్య పట్ల ఆసక్తి చూపుతారని చెప్పారు. కళాశాలలో యోగా కార్యక్రమాలకు గ్యారంపల్లి పంచాయతీ సెక్రెటరీ రేఖ, మహిళా పోలీస్ శివకుమారి, సిస్టర్ శకుంతల హాజరయ్యారు. వారితోపాటు అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ ధనరాజు, అన్నపూర్ణ, తనూజ, రామకృష్ణ, హరి, మస్తాన్ వలి, కొండయ్య, సయ్యద్ భాష మొదలగు వారు యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యం

11వ అదనపు జిల్లా జడ్జి మహేష్



పీలేరు, జూన్ 21 ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ప్రాంగణంలో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూయోగాను నిత్య జీవితం లో భాగం చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవన విధానంలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ జయద్దీన్, బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమం అనంతరం యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

## భక్తుల సేవలో ఏపీ గ్రామీణ బ్యాంకు

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 21 ప్రభాతవార్త శక్తిక్షేత్రం బోయకొండకు తరలివచ్చే భక్తుల సేవలో చౌడేపల్లి ఏపీ గ్రామీణ బ్యాంకు అధికారులు తరించారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంచే బ్యాంకు అధికారులు యాత్రీకులు, భక్తులకు చల్లని మజ్జిగను పంపిణీ చేసారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులు, ఆలయం వెలుపల వున్న యాత్రీకులకు చల్లని పానీయాలందించి సేవాగుణాన్ని చాటుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఉపకమీషనర్ ఏకాంబరంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జి.సత్యనారాయణరెడ్డి, సిబ్బంది ప్రవీణ్‌నాయక్, సత్య, మౌళి, రమణ, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

# గౌరవప్రదమైన ఉద్యోగాన్ని జాతి కోసం త్యాగం

వడ్డెర సంక్షేమానికి అలుపెరగని పోరాటం
రాష్ట్ర వడ్డెర సేవాదళ్ సలహా దారు బత్తల రమణ



తంబళ్లపల్లె జూన్ 21 ప్రభాతవార్త : ప్రభుత్వ ఉద్యోగం కోసం ఆరులో చాచే ఈ ఆధునిక సమాజంలో తన ప్రతిభతో వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని తృణప్రాయంగా త్యజించి దశాబ్దాలుగా అణగారిన వడ్డెర జాతి సంక్షేమం కోసం నడుం బిగించిన ఓ యువ నాయకుడి కథాంశం. పెద్దమండెం మండలం బండమీద పల్లి పంచాయతీ తురకపల్లెకు చెందిన బత్తల రమణ 2000 సంవత్సరంలో ఆయనకు టీచరుగా ఉద్యోగం అవకాశం వచ్చింది. టీచరుగా పనిచేస్తున్నా ఆయన ఆలోచన విధానాలు సమాజంలో తన వడ్డెర జాతి దశాబ్దాలుగా అణగారిన బతుకులతో కనీసం తమ బిడ్డలను పోషణ, చదివించుకొనే స్థాయి లేకపోవడం ఆయనను తీవ్రంగా ఆలోచింపజేసింది. 2003లో తన టీచర్ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకొని వడ్డెర సమాజ సేవకు దృఢ సంకల్పంతో ముందుకు నడిచాడు. బత్తల రమణ చేసిన త్యాగం వడ్డెర సమాజం కోసం పడుతున్న సామాజిక స్పృహకు సహచర వడ్డెర కులస్తులు ఆయనకు అన్ని విధాల అండగా నిలిచి ప్రోత్సాహం అందించారు. వారు ఇచ్చిన స్ఫూర్తితో నాటినుండి వెనుతిరగకుండా వడ్డెర సమాజ సేవలో దూసుకు వెళుతున్నాడు.ఈ సందర్భంగా గత కొన్నాళ్లుగా జిల్లాలోని వడ్డెర కుటుంబాలను సందర్శించి వారు పడుతున్న కష్ట నష్టాలను కళ్ళారా చూసి చెలించి తనకున్నంతలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక సాయం, కష్టాల్లో ఉన్న పేదలకు తనవంతు సహాయంతో పాటు వారికి అండగా నిలుస్తూ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇంతింతై వటుడింతై చందాన బత్తల రమణ అంచలంచెలుగా వడ్డెర సమాజానికి తన వంతు చేస్తున్న సేవలను రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు, సభ్యులు గుర్తించి బత్తల రమణను ఏకంగా రాష్ట్ర వడ్డెర సేవాదళ్ సంఘం రాష్ట్ర సలహాదారునిగా నియమించడం ఆయన చేసిన వడ్డెర సమాజ సేవకు నిలువెత్తు నిదర్శనం. బత్తల రమణ తనకు అప్పగించిన వడ్డెర సంఘం రాష్ట్ర పదవికి న్యాయం చేస్తూ ప్రతినిత్యం వడ్డెర సమాజ సేవలో భాగంగా వడ్డెరలను చైతన్య పరుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తూ సమాజంలో వడ్డెర బిడ్డలు ఆర్థిక స్థితిపై స్పందించి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ఎక్కడ వడ్డెర కులస్తుల సమస్యలు వస్తే వెంటనే వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు సహకారంతో పరిష్కారానికి మేమున్నామంటూ అండగా నిలిచి ఆదుకుంటూ వస్తున్నాడు. జిల్లావ్యాప్తంగా వడ్డెర సంఘాల బలోపేతం తో పాటు వారి ఆర్థిక స్థితిగతులు, విద్య పరంగా విద్యార్థుల సమస్యల పై ప్రత్యక్ష పర్యటనలతో వారి సమస్యలను క్రోడీకరించి పరిష్కారం చేసి సమాజంలో వడ్డెర బిడ్డలు తలెత్తుకొని జీవించేలా ఓ ప్రణాళిక బద్ధం గా అందరి సహాయ సహకారాలతో ముందుకు వెళ్తానని రాష్ట్ర వడ్డెర సేవాదళ్ సంఘం సలహాదారు బత్తల రమణ విలేకరులకు తెలిపారు.

## పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న వ్యక్తి మృతి



ముద్దనూరు, జూన్ 21 ప్రభాతవార్త: మండలంలోని కాండ్లోపల్లె గ్రామానికి చెందిన రాజుల రవీంద్ర రెడ్డి (36) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయంతో పాటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవీంద్ర రెడ్డి మద్యం తదితర చెడు అలవాట్లకు బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్యతో వాగ్వాదం జరగడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు.తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# విద్య పేరుతో కోట్ల వ్యాపార దోపిడీ

విద్యా మాఫియాపై విచారణ జరపాలి

బిల్లులు లేకుండా పాఠ్యపుస్తకాల విక్రయాలపై దాడులు నిర్వహించాలని పీడీఎస్‌యూ డిమాండ్

ఎడ్యుకేషన్ జూన్ 21 ప్రభాతవార్త: ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కోట్ల రూపాయలు దోచుకుంటున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆరోపించారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను నిర్దిష్ట దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కొన్ని బుక్‌స్టాల్స్‌లో బిల్లులు, ఇన్వాయిస్‌లు ఇవ్వకుండా భారీగా పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై జీఎస్టీ, కమర్షియల్ ట్యాక్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి జరిగిన అమ్మకాలపై సీసీ కెమెరా ఫుటేజ్, జీఎస్టీ రిటర్నులు, స్టాక్ రిజిస్టర్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలని కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, బుక్‌స్టాల్స్, హాస్టళ్లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, మహేశ్, ఉపేంద్ర, ఆజాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య కళాశాలలో ఘనంగా యోగాడే



మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త : పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు చంద్రశేఖర్, అధ్యాపకులు యోగా గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాముడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగా వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృడత్వం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన పొందడంతో పాటు యోగాను దినచర్యగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ భాస్కర్, హెచ్‌ఓడి డాక్టర్ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ



మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త : రూరల్ మండలంలోని పెంచుపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గొల్లపల్లెలో విద్యార్థులకు ఆదివారం ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. యాదవసంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ తుర్ల ఆనంద్ యాదవ్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు అందజేయడం పట్ల తనకు సంతోషకరంగా ఉందన్నారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయులు జివి.ప్రసాద్ సహకారం తో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు ఆ యనను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తల సమస్యలకే ప్రాధాన్యత

పార్లమెంటరీ కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్



మదనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ తెలిపారు. ఆదివారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలసి కార్యకర్తల సమస్యలను వివరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పఠాన్‌ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ ప్రధానంగా గత వైకాపా ప్రభుత్వ హాయాంలో కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేసి పూర్తిగా న్యాయం చేసేందుకు అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి సేవలు అందించిన సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలపడం జరిగిందన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆయన భోరసా ఇచ్చినట్లు తెలిపారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయ కకక్షసాధింపులకు గురైన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడం జరిగిందన్నారు.

# పీలేరులో కల్తీ పాపాల భైరవులు

మొదటి పేజీ తరువాయి

సూది మందు రసాయనాలు, పదార్థాలను కలిపి స్వచ్ఛమైన పాలను విషపూరితం చేస్తున్నారు. బిఎంసి, పాల కేంద్రాల్లో కూడా కొందరు ప్రైవేటు వ్యాపారులు విషపదార్థాలను కలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పౌడర్లతో కృత్రిమ పాలను సైతం తయారు చేసి సొమ్ము చేసుకుంటు న్నారు.

**కల్తీ ఇలా సాగుతోంది :-**

పట్టణ శివారు ప్రాంతాల్లోనే కాకుండా కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న పాల కల్తీలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఇక్కడ వ్యవసాయం దెబ్బతినడం, పశుగ్రాసం కొరత, నీటి కొరత వంటి వాటితో పాడి రైతులు పాడిని ఆదారం చేసుకొని జీవిస్తున్నారు. వీరి జీవితాల్లోకి కల్తీపాల వ్యాపారులు ప్రవేశించి అవకాశం ఉన్న అన్ని మార్గాల్లో పాలను కల్తీమయం చేస్తున్నారు. కలుషిత నీళ్ళు, పాలు విరిగిపోకుండా ఉండేందుకు సోడా కలపడం, పార్మాలిన్, గ్లూకోజ్, గంజిపొడి, యూరియా, సోడియం బైకార్బోనేట్, సోడియం కార్బోనేట్, సోడియం హైడ్రాక్సైడ్, కాల్షియంహైడ్రోజన్, జంతువుల కొవ్వు, పలు రకాల నూనెలతో కొంత పాలపొడి కలిపి కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. 50లీటర్ల వాస్తవ పాలల్లో 20లీటర్ల కల్తీ పాలను కలుపుతున్నా రు. ఇవి పాడవకుండా ఉండేందుకు చక్కెర, ఉప్పు కలుపుతారు. నేరుగా ఉత్పత్తి కేంద్రాలకు గుట్టుచ ప్పుడు కాకుండా తరలిస్తున్నారు. సిబ్బంది లాలూచితో ఇది నిరంతరంగా కొనసాగుతోంది. ఇలాంటి కల్తీపాల ను తాగడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. స్వచ్ఛమైన పాలలో అధిక పోషకాలు ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. కల్తీ పాలను తాగడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం తలెత్తుతాయి. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పాలు ఎంతో దోహదం చేస్తాయి. ఏది ఏమైనప్పటికి ఇలాంటి కల్తీ వ్యాపారులపై సంబందిత అధికారులు దాడిచేసి గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

CHANGE OF NAME
I SHAIK SHEPPI SAHEB (Old Name), S/o. SHAIK MASTAN SAHIB, R/o D.No.1/1910-3-1, Sriram Nagar, Near Arogyamatha Church, Railway Station Road, Kadapa, Y.S.R. Dist., A.P. - 516004. I changed my name to SHAIK SHAFI SAHEB (New Name). Henceforth, I shall be Known as SHAIK SHAFI SAHEB (New Name) for all Purposes.

## రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలు

### జూలైలో నిర్వహణకు ఏర్పాట్లు
### 22 జిల్లాల నుంచి హాజరుకానున్న క్రీడాకారులు



**పులివెందుల,జూన్ 21, ప్రభాతవార్త**
పులివెందుల పట్టణంలో జూలై నెలలో రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీనియర్ హాకీ క్రీడాకారుడు శేఖర్ జ్ఞాపకార్థంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు అనిల్ కుమార్, శౌరి కుమార్, మునిరాజ్ తెలిపారు. రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి బాల బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభి వృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను సీనియర్ హాకీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో కల్పిస్తున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల ద్వారా యువ క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు అనిల్ కుమార్, శౌరి కుమార్, శేఖర్ బాబు, ప్రభాకర్, తేజ, ఫ్రాన్సిస్ రవికుమార్, సూరి, కరుణాకర్, కిషోర్, శాంతి, ఏలియా, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

### భా.జ.పా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లి, జూన్ 21, ప్రభాతవార్త**
ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లి ఆర్టీసీ బస్టాండ్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బీజేపీ నాయకులతో కలసి ఆర్టీసీ బస్టాండ్ను పరిశీలించారు. ఆర్టీసీ కంట్రోలర్ లక్ష్మీ   ్మకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లి నుంచి కడప, పులివెందుల, ప్రొద్దుటూరు,రాయచోటి, తిరుపతి, చెన్నైలాంటి వందలాది మంది ప్రయాణికులు, వ్యాపారస్థులు, ఐఐటి విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు.గతంలో అనేక సార్లు ప్రయనీకులకు సంబంధించిన విలువైన వస్తువులు దొంగలించడం జరిగిందని అన్నారు.ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వేంపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పుష్పలత నాయక్, సురేష్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి

### ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ



**పీలేరు, జూన్ 21 ప్రభాతవార్త:**
మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ఇతర ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు మరియు ఇతర ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా దోచుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సులభ రుణాల పేరుతో ప్రజలను ఆకర్షించి, అనంతరం అధిక వడ్డీలు, దాచిన ఛార్జీలు, జరిమానాలు విధిస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రుణాలు తీసుకున్న మహిళలు, రైతులు, చిన్న వ్యాపారులు వాయిదాలు చెల్లించడంలో ఆలస్యం అయితే ఫీల్డ్ సిబ్బంది ఇళ్లకు వెళ్లి అవమానకరంగా ప్రవర్తించడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం సంబంధిత నియంత్రణ సంస్థలు ఫైనాన్స్ కంపెనీల కార్యకలాపాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, చట్టవిరుద్ధ వసూళ్లు, అధిక వడ్డీ రేట్లు, వేధింపులకు పాల్పడుతున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టకపోతే ప్రజల తరఫున ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని మద్దెల అమృత్ తేజ హెచ్చరించారు.

## దళిత యువకుడి ఆత్మహత్యపై ఆందోళన

**మైదుకూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
మైదుకూరు టౌన్ స్థానిక ఎ.పి.ఎం.ఆర్.పి.యస్. రాష్ట్ర కార్యదర్శి మైదుకూరు నియోజకవర్గం మిద్దె వెంకటరమణ మాట్లాడుతూ దళిత యువకుడి ఆత్మహత్య ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.పి.ఎం.ఆర్.పి.యస్. రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ కుమారుడు క్రాంతికుమార్‌ను క్రిష్టలంక పోలీస్ స్టేషన్ సి.ఐ నాగరాజు వేధింపులకు గురిచేయడం వల్ల అతను ఆత్మహత్య చేసుకుని చనిపోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. గతంలో క్రాంతికుమార్‌పై కొన్ని కేసులు ఉండటంతో రౌడీ షీటర్ అని ముద్రవేసి, కొన్ని నెలలుగా చిత్రహింసలు, భయభ్రాంతులకు గురిచేయడం వల్ల అతను గుళికల మందు తాగి చనిపోయినట్లు తెలిపారు. క్రాంతికుమార్ తన మరణానికి కారణం సి.ఐ నాగరాజు అని సోషల్ మీడియా ద్వారా సెల్ఫీ వీడియోలో వెల్లడించిన విషయాన్ని మిద్దె వెంకటరమణ ప్రస్తావించారు. "చట్టాన్ని కాపాడే పోలీసు వ్యవస్థే చట్టాన్ని నిర్వీర్యం చేసి మనుషుల ప్రాణాలు తీసే వ్యవస్థగా మారింది" అని ఆయన విమర్శించారు.గత 30 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడైన పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగకు ఈ పోలీసు వ్యవస్థ చేసిన తప్పిదం వల్ల కన్నకొడుకును కోల్పోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, క్రాంతికుమార్ ఆత్మహత్య వెనుక ఉన్నటువంటి సి.ఐ నాగరాజును, మిగతా అధికారులను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితమ్మ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు కూడా పేరుపోగు కుటుంబాన్ని పరామర్శించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రంగనాథుని కోవెల అభివృద్ధి పనులు వేగవంతం

### రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ



**సిద్ధవటం, జూన్21 ప్రభాతవార్త**
పురాతనమైన రంగనాథుని కోవెల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి మండల కేంద్రమైన సిద్ధవటం లోని పురాతనమైన శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథుని ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి పనులను ఆదివారం రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం దక్షిణ ముఖద్వారంగా పేరుగాంచిన సిద్ధవటం లోని శ్రీ రంగనాదుని ఆలయాన్ని త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని రంగనాథుని మూల విరాట్ విగ్రహము, గజ స్థంభం నూతనంగా ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని సిద్ధవటేశ్వర, బాల బ్రహ్మేశ్వర ఆలయానికి వెళ్లే రహదారి పూర్తిగా వెడల్పు చేస్తామని పలు ఆలయాలకు రహదారులు అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు ఆలయ గోపురం, గర్భగుడి, ప్రహరీ గోడ, కళ్యాణమండపం నందు పనులు జరుగుతున్నాయని భక్తులకు త్వరలో అందుబాటులో తీసుకొచ్చి పూర్వ వైభవం తీసుకొస్తామని పేర్కొన్నారు ఆలయానికి సంబంధించిన భూములు, గురించి అధికారులతో మాట్లాడుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఏ చిన్న వెంకటయ్య ఏఎంసి డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, పసుపులేటి గంగయ్య గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## అన్నదాతకుఅండగా సాగునీరు, పంట బీమా, ఆర్థిక సాయంతో రైతుకు భరోసా

### జనసేనపార్టీపులివెందుల ఇంచార్జ్ డాక్టర్. హరీష్



**వేంపలి, :జూన్ 21, ప్రభాత వార్త:**
"అన్నదాత సుఖీభవ" కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం కలిసి రూ. 3,125 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రకటించినందని జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్. హరీష్ మాట్లాడారు. తదనంతరం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ.20,000 ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా (మొదటి విడత రూ. 7,000, రెండో విడత రూ. 7,000, మూడో విడత రూ. 6,000) అందిస్తున్నాము అని అన్నారు. గత ప్రభుత్వంలో కేవలం రూ. 13,500 మాత్రమే అందేవి, కానీ మేము ఇచ్చిన హామీ మేరకు ఈ మొత్తాన్ని రూ. 20,000కి పెంచాము.రైతులకు ఎదురయ్యే సమస్యలను, ముఖ్యంగా నీటి పారుదల మరియు పంట నష్టం వంటి విషయాలను పరిష్కరించడానికి మేము నిరంతరం కృషి చేస్తున్నాము అని మాట్లాడారు. తల్లికి వందనం పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు అర్హత గల ప్రతి ఒక్కరితల్లులకు నేరుగావారి అకౌంట్లో డబ్బులు కూటమి ప్రభుత్వం వేసిందిఅని అన్నారు. సూపర్ ఫిక్స్ పథకాలు కూడ కూటమి ప్రభుత్వం చెప్పినట్టు చెప్పినవిధంగాఅమలుచేస్తుంది అని అన్నారు. రైతులుఆశించిన విధంగాగిట్టుబాటుధరలనుకూడా కూటమి ప్రభుత్వం కల్పించింది అని అన్నారు. పంట నష్టాన్ని నివారించడానికి, ముఖ్యంగా గాలి వానల వల్ల వచ్చే నష్టాల నుంచి రైతులను రక్షించడానికి పంట ఇన్సూరెన్స్‌ను సకాలంలో అందించడంపై దృష్టి పెడుతున్నాము. దీనికోసం గ్రామాల వారీగా, మండలాల వారీగా నీటి వాడకం మరియు గాలి వేగాన్ని కొలిచే యంత్రాలను ఏర్పాటు చేస్తున్నాము. అలాగే భవిష్యత్తులో పంటలకు సరైన మార్కెట్ సౌకర్యాలు మరియు ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాముఅని, రైతులకు ఏ సమస్య లేకుండా చూసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని హ ర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి, కూటమినాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల జాబితాను పారదర్శకంగా రూపొందించడమే ప్రధాన ఉద్దేశం

**రామాపురం , జూన్ 21, ప్రభాతవార్త**
ఎన్నికల జాబితాను పారదర్శకంగా కచ్చితంగా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వే ముఖ్య ఉద్దేశమని కుమ్మరపల్లి గ్రామ టిడిపి నాయకులు ప్రదీప్ కుమార్ రెడ్డి కోటిరెడ్డి రామాంజనేయులురెడ్డి తెలిపారు.అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం చేయాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రామాపురం మండలం కుమ్మరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం నిర్వహిస్తున్న సర్ సర్వే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సర్వే ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఓటరికి ఒకే ఫోటోతో కూడిన రెండు దరఖాస్తు పత్రాలను అందజేస్తున్నామని, వాటిలో తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసి తిరిగి అందజేయాలని బీఎల్వో సూచించారు. ఎన్నికల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా ఓటరు జాబితాను మరింత విశ్వసనీయంగా రూపొందించేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం చేపట్టిన సర్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించడం ద్వారా ఎన్నికల జాబితా పారదర్శకంగా, కచ్చితంగా తయారవుతుందన్నారు.ప్రజల సహకారంతోనే ఈ ప్రక్రియ విజయవంతం అవుతుందని తెలిపారు. సర్వే సందర్భంగా గ్రామ ప్రజలు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల జాబితా నాణ్యతను మెరుగుపరచే ఈ కార్యక్రమానికి ప్రజలు స్పందించాలని కోరారు.



సర్వే ప్రాముఖ్యతను వివరిస్తూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిన టిడిపి నాయకులు.

## నిరాధార ఆరోపణలు అవాస్తవం

### ఎంపీడీఓ ఫణి రాజకుమారి



**సిద్దవటం జూన్ 21 ప్రభాతవార్త**
తనపై అవాస్తవాలు, నిరాధార ఆరోపణలు చేయడం తగదని ఆదివారం ఎంపీడీఓ ఫణి రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను, అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా ఎంపీపీ పేరుతో ఆమె కుమారుడు తనపై అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాను సిద్ధవటం మండల ఎంపీడీఓగా వచ్చినప్పటి నుండి ఎంపీపీ అనుమతులు మరియు మండల పరిషత్ తీర్మానాల ఆధారంగానే సుమారు రూ.77 లక్షల విలువైన పనులకు పిఎఫ్ఎంఎస్ ద్వారా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అన్ని చెల్లింపులు నిబంధనల ప్రకారమే జరిగాయన్నారు. అనంతరం ఎంపీపీ కుమారుడు చంద్రశేఖర్ గత ఆరు నెలలుగా తనపై ఒత్తిడి తెస్తూ, విత్‌ఔట్ వర్క్ రూ.10 లక్షలు విడుదల చేయాలని పలుమార్లు కోరారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయకుండా నిధులు విడుదల చేయడం సాధ్యం కాదని నేను ఆ డిమాండ్‌ను పలుమార్లు స్పష్టంగా తిరస్కరించానన్నారు. ఈ విషయమై ఆయన పలుమార్లు నా కార్యాలయానికి వచ్చి వాగ్వాదాలకు దిగినా, నేను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబోనని కఠినంగా తెలియజేయడం జరిగింద న్నారు. ప్రస్తుతం పిఎఫ్ఎంఎస్ ఖాతాలో అంత మొత్తం అందుబాటులో లేదని, ప్రజలకు అత్యవసరమైన తాగునీటి మరియు ఇతర ప్రాధాన్యత పనుల కోసం నిధులను కేటాయించి ఉంచామని వారికి వివరించానన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గ్రాంట్లు వచ్చిన తరువాత, నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పిస్తే పరిశీలించి చెల్లింపులు చేస్తామని కూడా తెలియజేశామన్నారు. అయితే విత్‌ఔట్ వర్క్ రూ.10 లక్షలు ఇవ్వాలనే వారి ఒత్తిడికి నేను లొంగకపోవడంతో, వ్యక్తిగత కక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఈ విధమైన వార్తలను ప్రచారం చేశారన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ అధికారులపై అసత్య ప్రచారం చేయడం బాధాకరమని ఆమె ప్రకటనలో తెలిపారు.

## యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలి



**నందలూరు, జూన్ 21 ప్రభాతవార్త:**
యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని బీజేపీ నాయకులు పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందలూరు సహకార బ్యాంకు త్రీమెన్ కమిటీ డైరెక్టర్ ఆంధ్ర శివారెడ్డి, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు మండెం నాగేంద్ర, బీజేపీ యువ నాయకుడు వీరబల్లి జయకుమార్ రెడ్డి, బీజేపీ రాజంపేట నాయకుడు బాలరాజు సుందర్ బాబు, నందలూరు రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్య కార్డియాక్‌లో ఉచిత వైద్య శిబిరం



**ప్రొద్దుటూరు, అర్బన్ 21, ప్రభాతవార్త:**
ప్రతి నెల మూడవ ఆదివారం నాడు ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న లక్ష్య హాస్పిటల్ నందు పేద ప్రజల కోసం ఉచిత కంటి,గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి,డాక్టర్ హరిత తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం నాడు 62 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి 48 మంది రోగులను ఉచితంగా పరీక్షించి వీరిలో 29 మందికి ఉచితంగా ఇ. సి.జి మరియు 10 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి రోగులకు తగు చికిత్స, సూచనలు ఇచ్చారు.డాక్టర్ హరిత 39 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,వారికి తగు చికిత్స,సూచనలు అందించారు.

## యోగాతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత

### ఎంపీడీవో ఉషారాణి



**తంబళ్లపల్లె జూన్ 21 ప్రభాతవార్త ః**
ప్రతి ఒక్కరికి యోగా ఆసనాలు చేయడంతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. ఆదివారం ఉదయం ఆమె ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, అధికార పార్టీ నాయకులు, విద్యార్థులు అంతర్జాతీయ యోగా ఆసనాల కార్యక్రమం పాల్గొని ముమ్మరంగా ట్రైనర్‌ల సూచనల మేరకు ముమ్మరంగా ఆసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉషారాణి, ఎంఈఓ త్యాగరాజులు యోగ ఆసనాల వలన శారీరక ఆరోగ్య సమస్యల ఉపశమనం పై పలు సూచనలు సలహాలు చేశారు. యోగ నిర్వాహకులకు టిడిపి నాయకుడు పురుషోత్తం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మారుతీ కుమార్, ఎంఈఓ నాగ సుబ్బరాయుడు, ఏపిఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, సిసి లు రమణ, కత్తి నరసింహులు,లైన్ ఇన్స్పెక్టర్ భాస్కర్,కార్యదర్శి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్,పద్మావతి, భాస్కర్, మనోహర్,టిడిపి నాయకులు పురుషోత్తం, బేరి శ్రీనివాసులు,నరసింహులు, రామచంద్ర,రామాంజులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బద్వేల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

### వేలాదిగా పాల్గొన్న అధికారులు, ప్రజలు



**బద్వేలు అర్బన్, జూన్ 21, ప్రభాతవార్త**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా డీసీ బ్యాంక్ చైర్మన్, బద్వేల్ నియోజకవర్గ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యోగా సాధకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని అన్నారు. యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంత, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి ఆయన యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేయడంలో మున్సిపల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు చురుకుగా పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**కలసపాడు, జూన్ 21 ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన కలసపాడు లోని పద్మావతి మహిళా మండలి వృద్ధుల ఆశ్రమమం లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా అనాథ ఆశ్రమం నందు ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధఆశ్రమ నిర్వాహకులు ఎస్ వెంకటరెడ్డి మాట్లాడుతూ పద్మావతి మహిళా మండలి వృద్ధాశ్రమం నందు యోగ దినోత్సవం సందర్భంగా వృద్ధులతో మాట్లాడుతూ వృద్ధులు యోగా యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ప్రతినిత్యం యోగాను అనుసరిస్తే తమ ఆరోగ్యాలను కాపాడు కోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ప్రతిదినం యోగాను మరవకుండా అనుసరించినప్పుడే మన ఆరోగ్యానికి ఆయుష్షుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళా మండలి వృద్ధాశ్రమంలో యోగ నిర్వహించిన అనంతరం మహిళా మండలి ప్రతినిధులకు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

**నందలూరు, జూన్ 21 ప్రభాతవార్త :**
మండలంలోని పాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఎగువ కుమ్మరపల్లి గ్రామంలో తిరుపతికి చెందిన నరేంద్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజంపేట జనసేన పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు యల్లటూరు శివరామ రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అవసరమని అన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తగిన వైద్య సలహాలు పొందగలరని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మానవతా సేవలో భాగస్వాములైన బ్యాంకు సిబ్బంది



**పులివెందుల, జూన్ 21, ప్రభాతవార్త :**
బ్యాంక్ యూనియన్ వ్యవస్థాపకులు కామ్రేడ్ తారక్‌నాథ్ 22వ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో అమరావతి సర్కిల్ పులివెందుల క్లస్టర్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్‌బీఐ పులివెందుల లోకల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ కళ్యాణ్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తం అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ఆరోగ్యవంతులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వా ములు కావాలని పిలుపుని చ్చారు.కామ్రేడ్ తారక్ నాథ్ ప్రజా సేవలు, ఉద్యోగుల సంక్షేమం కోసం చేసిన కృషిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, అన్వేష్ రెడ్డి, సురేష్, గంగాధర్, చంద్రనారాయణ, జిలానీ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన దాతలను నిర్వాహకులు అభినందిస్తూ సమాజంలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## యోగాతో మనసుకు ప్రశాంతత మనిషికి సంపూర్ణ ఆరోగ్యం



**చౌడేపల్లి, జూన్ 21 ప్రభాతవార్త**
మనసుకు ప్రశాంతత మనిషికి సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమవుతుందని ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ఆసనాలు వేయించారు. ఆరోగ్య భారతం కోసం యోగ ఒక్కటే మార్గమన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకొంటే సర్వ రోగాలకు దూరంగా వుండవచ్చునన్నారు. మానవుల అంతరంగ శుద్ధికీ, ఆరోగ్య సిద్ధికి యోగా శిఖరం లాంటిదన్నారు. యోగాసనాల వల్ల కల్గే లాభాలను ఆసనాలు వేయించే క్రమంలో వివరించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## " సర్ " కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలి

### ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



**చౌడేపల్లి, జూన్ 21 ప్రభాతవార్త**
ఓటరు జాబితా నాణ్యతను పెంచి ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగడానికి తలపెట్టిన సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పలు అంశాలపై దిశా నిర్దేశ్యం చేసినట్లు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, పుంగనూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల పనితీరు, ముఖ్యంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి చర్చించినట్లు కళ్యాణ్‌భరత్ తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ నాయకుడు చంగల్‌రెడ్డి, జిల్లా సోషియల్ మీడియా కార్యదర్శి నాగేంద్ర, నాయకులు ప్రవీణ్, కిషోర్‌కుమార్ తదితరులు ఎంపిని కలసిన వారిలో వున్నారు.

## మైదుకూరులో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం



**మైదుకూరు, జూన్ 21, ప్రభాతవార్త:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" కార్యక్రమంలో భాగంగా మైదుకూరు పట్టణంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఆదివారం యోగాంధ్ర 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వై. రంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వై. రంగస్వామి మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం "ఆరోగ్య ఆంధ్ర" లక్ష్యంతో ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మైదుకూరు ప్రజలను ఆయన అభినందించారు.అనంతరం యోగా శిక్షకుడు కృష్ణారెడ్డి పలు యోగాసనాలు, ప్రాణాయామ విధానాలను పాల్గొన్న వారికి ప్రదర్శించి వివరించారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడికి యోగ ఎంతో అవసరం

### కమాండెంట్ ఆనంద్ రెడ్డి



**సిద్ధవటం, జూన్ 21 ప్రభాతవార్త**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు మండలంలోని భాకరాపేట సమీపాన ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో ఆదివారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పోలీస్ కమాండెడ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్ చెందిన శిక్షకులు యోగ యొక్క ప్రాముఖ్యత శారీరక మానసిక ఆరోగ్య పరిరక్షణలో ఒత్తిడి నివారణలో యోగా అందించే ప్రయోజనాల గురించి వివరించడం జరిగిందని ప్రతిరోజు యోగ చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్య వంతులుగా ఉంటారని శరీరం బరువు తేలిక కావడం, ఒళ్ళు నొప్పులు పూర్తిగా తగ్గిపోతాయని ప్రతి ఒక్కరు ఆరోగ్య వంతులుగా ఉండాలంటే యోగ నియమాలు పాటించాలని తెలిపారు ఆరోగ్యవంతమైన జీవన శైలి అలవర్చుకోవడానికి యోగ పాటించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ పటాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నిమ్మనపల్లెలో ఘనంగా యోగాడే



**నిమ్మనపల్లె, జూన్ 21 ప్రభాతవార్త :**
నిమ్మనపల్లెలో ఆదివారం ఘనంగా యోగాడేను ఘనంగా నిర్వహించారు. ఈ యోగాను మండలంలోని రెడ్డివారిపల్లె జడ్పిహైస్కూల్ ఆవరణంలో యోగాం ధ్రాలో భాగంగా యోగసనాలు వేశారు. యోగా శిక్షకులు,అధికారులు యోగా గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ పక్రుద్దిన్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరుయోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగా వల్ల మానసిక ప్రశాంతంతతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన పొందడంతో పాటు యోగాను దినచర్యగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పక్రుద్దిన్‌సాహెబ్, ఏఓ రమేష్‌బాబు, డిప్యూటి ఎంపిడిఓ బాలరాజు, ఉపాధ్యాయబృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## ఖాజీపేట సిఐ వంశీధర్



ఖాజీపేట, జూన్ 21, ప్రభాతవార్త,
ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఖాజీపేట సీఐ వంశీధర్ అన్నారు. మండల కేంద్రమైన ఖాజీపేట లో ఆదివారం ప్రత్యేక ట్రాఫిక్ తనిఖీ డ్రైవ్ నిర్వహించినట్లు ఖాజీపేట సీఐ వంశీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను రోడ్డుపై నడపరాదని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను వాహనాలు నడపకుండా పర్యవేక్షించాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ నియమాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సురక్షితమైన ప్రయాణానికి ప్రజల సహకారం అవసరమని సీఐ వంశీధర్ పేర్కొన్నారు

# ఐచర్ వాహనం చక్రాల కింద నలిగి వృద్ధురాలు మృతి



రామసముద్రం జూన్ 21, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం మాలే నత్తం గ్రామానికి చెందిన పెద్ద రెడ్డెప్ప భార్య ఆదెమ్మ 60 తమ వ్యవసాయపొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది వెంటనే ఆదెమ్మ తల దాచుకోవడానికి నిలిపి ఉన్న ఐచర్ వాహనం కిందకు వెళ్ళింది డ్రైవర్ బండి స్టార్ట్ చేసి ముందుకు సాగడంతో వెనక చక్రాల కింద నలిగిపోయిన ఆదెమ్మ కు తీవ్రంగా గాయం అయ్యింది. వెంటనే స్థానికులు గమనించి ఆదెమ్మను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించే చికిత్సలు అందిస్తుండగా చికిత్స పొందుతూ ఆదెమ్మ మృతి చెందింది, వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యా సంస్థల్లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



బద్వేలు, జూన్ 21, ప్రభాతవార్త
పట్టణంలోని శ్రీ బిజీ వేముల వీరారెడ్డి విద్యా సంస్థల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రటరీ కె.రితీష్ రెడ్డి, డీన్ డాక్టర్ బి.రామలక్ష్మి రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట సుబ్బారెడ్డి, ఇతర విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ కె.రితీష్ రెడ్డి, యోగా వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే యోగా చేయడాన్ని జీవితంలో భాగంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగాంధ్ర ఆరోగ్యాంధ్ర నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అందరూ కలిసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవం



ప్రొద్దుటూరు అర్బన్,జూన్ 21, ప్రభాత వార్త :
ప్రపంచ యోగా దినోత్సవము సందర్భంగా శ్రీ వాసవి ఉద్యానవనం (అమ్మవారిశాల తోట)లో ఆదివారం జగద్గురువు శ్రీశ్రీశ్రీ శంకరాచార్యులు శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాదీశులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారు స్వయంగా యోగాసనాలు వేశారు. వచ్చిన ప్రజలచే యోగాసనాలు చేయించారు. యోగాసనాల ఆవశ్యకతను గురించి తెలియజేస్తూ యోగాసనాలు చేయటం వలన మన జీవనశైలిని మార్చుకొని, ఆరోగ్య సంపదను పెంపొందించు కోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రాంమ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీమల్లెంకొండు ప్రతాప్, కోశాధికారి జాలాది పరమేశ్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు

# శిల్పారామంలో చిన్నారుల స్టెప్స్ అదుర్స్



కడప కార్పొరేషన్ జూన్ 21 ప్రభాతవార్త:
కడప శిల్పారామంలో సాయంత్రం 6 గం.లకు బ్రహ్మకుమారిస్ ఓం శాంతి బ్రాంచ్ ఆధ్వర్యంలో యోగా, మెడిటేషన్ ప్రదీప, కావ్య అక్కయ్యలు ఇరువురి ఆధ్వర్యంలో కార్యక్రమా లు జరిగాయి. అనంతరము సాంస్కృతిక కళావేదిక మీద పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన నేత్రస్వి డాన్స్ అకాడమీ బృందం పల్లె,జానపద నృత్యాలతో, శాస్త్రీయ, సినీ నృత్యాలతో అబ్బురపరిచే విధంగా ప్రేక్షకులను ఎంతగానో అల్లరించినాయి. గోదారి గట్టు మీద రామచ్చికవే, నమోరే నమోరే, జాజకాయ జై బాలయ్య పాటలకు చిన్నారుల స్టెప్పులు వేశారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలన అధికారి పి. శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

# పీఎం సూర్య ఘర్ విద్యుత్తు బిల్లుల ఆదా

## ట్రాన్స్‌కో ఏడీఈ శివయ్య



కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:
ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించవచ్చని ట్రాన్స్‌కో ఏడీఈ శివయ్య, ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్‌లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు అమర్చిన సోలార్ రూఫ్ ట్యాప్‌లను ఏడీ, ఏఈలు పరిశీలించారు. సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో మొదటి విభాగంలో భాగంగా మండల కేంద్రంలోని పత్తేగడ, మర్రికుంటపల్లి పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు సోలార్ రూఫ్ ట్యాప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో లైన్‌మెన్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాసనంతో ఆరోగ్యం

దువ్వూరు, జూన్ 21, ప్రభాతవార్త:
యోగాసనం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన దువ్వూరులో ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ మండపం నందు యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని యోగాంధ్ర2026ను జరిపారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వక్తలు మాట్లాడుతూ యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యం బాగా ఉంటుందని అలాగే అలసట తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు అరగంట పాటు యోగాసనాలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, యోగా గురురు తిరుమల్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లె వాసవి అమ్మవారికి దాతలచే వెండి కవచాలు చీర వస్తువుల బహూకరణ



వేంపల్లి, జూన్ 21, ప్రభాతవార్త:
వేంపల్లి మెయిన్ బజార్ లోని అమ్మవారి శాలలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహము, 108 గోత్రనామాలకు సంబంధించి దాతలచే 25 లక్షలు విలువైన వెండి కవచాలు, చీరలు వస్తువులు, ఆదివారం బహూకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి మాజీ అధ్యక్షురాలు, గండి ఆర్యవైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీ కిషోర్ సతీమణి పచ్చిపులుసు ప్రవీణ వేంపల్లి ఇతర ప్రాంతాల్లోని ఆర్యవైశ్య మహిళలు కుటుంబ సభ్యుల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు సేకరించి ఈ వస్తువులన్నీటిని తయారు చేయించి అమ్మవారి శాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తోటం శెట్టి చంద్రశేఖర్ యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద శర్మకు వీటిని అప్పగించారు. ముందుగా వీరంతా మెయిన్ బజార్ లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి వస్తువులకు పూజలు చేయించి ఊరేగింపుగా అమ్మవారి శాలకు వచ్చి ఈ వస్తువులన్నింటిని బహూకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి మాజీ అధ్యక్షురాలు అచ్చుపులుసు ప్రవీణ కృషితో వేంపల్లి చుట్టుపక్కల గ్రామాల, జిల్లాల ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు సహకరించి విరాళాలు ఇవ్వడం వల్లే ఇంత బూరి విరాళ కార్యక్రమానికి ఆస్కారం ఏర్పడింది. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన పచ్చిపులుసు ప్రవీణ, దాతలందరినీ ఆర్యవైశ్య ప్రముఖులు అభినందిస్తున్నారు.

# ప్రాంతీయ సంస్కృతికి బండలాగుడు పోటీలే నిదర్శనం

## నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు



ఒంటిమిట్ట, జూన్ 21, ప్రభాతవార్త:
ఒంటిమిట్ట మండలం కోనరాజు పల్లె అరుంధతి వాడలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వాహకులు, గ్రామస్తులు నాలుగవ వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి. జగన్ మోహన్ రాజు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ కమిటీ స్థానిక టిడిపి నాయకులు ఆయనకు పూలమాలలతో, డప్పులతో ఆహ్వానం పలికారు. అభయాంజనేయ స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్షికోత్సవ సందర్భంగా నిర్వాహకులు నిర్వహించిన బండలాగుడు పోటీలను ప్రారంభించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలమంతా సుభిక్షంగా ఉండి ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో దైవభక్తితో ఎటువంటి సమస్యలు లేకుండా ఐకమత్యంగా జీవించాలని సకాలంలో వర్షాలు పడుతూ పాడిపంటలతో లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ సంస్కృతికి, ఆచారాలకు బండలాగుడు పోటీలే కారణమన్నారు. సనాతన ఆచారాలను హిందూ మత ప్రాశస్త్యతను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ప్రాంతీయ సంస్కృతిని కాపాడడంలో ఇటువంటి సాంప్రదాయ క్రీడలు ప్రత్యేక పాత్ర వహిస్తాయన్నారు. రైతన్నలు పశు సంపాదనను గౌరవిస్తూ నిర్వహించే పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన ప్రజలందరూ అభయాంజనేయ స్వామి వార్షికోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని అర్చకులు నిర్వహించే పూజా కార్యక్రమాలు తిలకించి ముద్దులయ్యారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. బండలాగుడు పోటీలలో పాల్గొని ఆసక్తికరంగా తిలకించడం జరిగింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని అభయాంజనేయ స్వామి నాలుగవ వార్షికోత్సవాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, సుంకేసుల భాష తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు యోగా కీలకం ఆర్డీవో నారాయణరెడ్డి

## ఒత్తిడిని జయించే ఉత్తమ సాధనం యోగా

## బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి



పీలేరు, జూన్ 21, ప్రభాతవార్త:
స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా థెరపిస్ట్ లక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖిఖిఒత్తిడిని జయించడానికి, ఏకాగ్రత పెంచుకోవడానికి, శారీరక దృఢత్వాన్ని సాధించడానికి యోగా ఉత్తమ సాధనం. ఆరోగ్యవంతమైన భారతదేశం, ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు బి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ గారి ..ఖిఖిఫిట్ ఇండియాఖిఖి.. స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యోగాను ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను సాధించడమే ఎన్ డి ఏ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన సూచించారు. 2014 సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి 69వ సర్వసభ్య సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ఈ ప్రతిపాదనను యునైటెడ్ నేషన్ ముందు ఉంచారని ఈ తీర్మానానికి రికార్డు స్థాయిలో 177 దేశాల మద్దతు లభించిందని దీంతో డిసెంబర్ 11 2014న ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. దివ్య యోగ విద్యాలయం అధ్యక్షురాలు,యోగా థెరపిస్ట్ లక్ష్మీ మాట్లాడుతూ పలు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన పద్ధతులను ప్రదర్శించి వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. మారుతున్న జీవనశైలిలో యోగా అనేది ఔషధంలా పనిచేస్తుంది. మానసిక ప్రశాంతతకు, రోగనిరోధక శక్తి పెరగడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమం అనంతరం యోగా థెరపిస్ట్ లక్ష్మీ ృ న్యాయ సలహాదారులు రాయల సుధాకర్ దంపతులను ఆర్డిఓ నారాయణరెడ్డి ఎంపీడీవో శివశంకర్ తదితరులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, డెమో అధికారి నిర్మలమ్మ, పంచాయతీ ఈవో బ్రహ్మానంద రెడ్డి, న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల్ సుధాకర్, రిటైర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీ గోపీనాథ్ రెడ్డి. ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు ,మహిళలు, పంచాయతీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విజయవాడ సన్ షైనర్స్ విధ్వంసం

## 20 ఓవర్లలో 290 పరుగుల భారీ స్కోరు

## కెప్టెన్ అశ్విన్ హెబ్బార్, అభినవ్ మెరుపు సెంచరీలు.. కాకినాడ బౌలర్లకు చుక్కలు

## తొలి మ్యాచ్ లో రాయలసీమ రాయల్స్‌కు ఘన విజయం

## బౌలింగ్ లో మెరిసిన అజయ్ కుమార్

మొదటి పేజీ తరువాయి



విజయం సాధించిన రాయలసీమ రాయల్స్ జట్టు

ఇచ్చాడు. అనంతరం 133 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ రాయల్స్ 14.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టు విజయంలో జీఎస్‌పీ తేజ కీలక పాత్ర పోషించాడు. అతడు 42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 73 పరుగులు సాధించాడు. ఏ. సాయి సూర్య తేజ రెడ్డి 24 బంతుల్లో 30 పరుగులతో (1 ఫోర్, 2 సిక్సర్లు) నాటౌట్‌గా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. తుంగభద్ర వారియర్స్ బౌలర్లలో ఎం. దీపక్ రెండు వికెట్లు తీశాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన కే. అజయ్ కుమార్‌కు మంత్రి రామప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ విజయంతో రాయలసీమ రాయల్స్ జట్టు టోర్నీలో తన స్థానాన్ని మరింత బలపర్చుకుంది. విజయవాడ సన్ షైనర్స్, కాకినాడ కింగ్స్ జట్ల మధ్య జరిగిన రెండవ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. టాస్ గెలిచిన విజయవాడ సన్ షైనర్స్ బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి బౌలర్లపై తొలి నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనింగ్ జోడీ కెప్టెన్ అశ్విన్ హెబ్బార్, ఎం.అభినవ్‌లు కాకినాడ బౌలర్లను చిత్తు చేస్తూ మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. బౌండరీల మోతతో మైదానాన్ని హోరెత్తించిన వీరిద్దరూ తొలి వికెట్ పడకుండా చివరి ఓవర్ వరకు నిలిచి భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. కాకినాడ కింగ్స్ బౌలర్లు తొలి వికెట్ కోసం 19.3 ఓవర్ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. కెప్టెన్ అశ్విన్ హెబ్బార్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టి కేవలం 53 బంతుల్లో 9 సిక్సర్లు, 13 ఫోర్లతో ఏకంగా 130 పరుగులు సాధించాడు.మరో ఓపెనర్ ఎం.అభినవ్ తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపిస్తూ 69 బంతుల్లో 10 సిక్సర్లు, 9 ఫోర్లతో 137 పరుగుల విధ్వంసకర సెంచరీ నమోదు చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన జహీర్ అబ్బాస్ ఎదుర్కొన్న రెండు బంతుల్లోనే రెండు సిక్సర్లు బాది 12 పరుగులు సాధించాడు. దీంతో విజయవాడ సన్ షైనర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఒకే ఒక్క వికెట్ నష్టానికి 290 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. టీ20 ఫార్మాట్‌లోనే అత్యంత భారీ లక్ష్యాల్లో ఒకటైన 291 పరుగుల విజయ లక్ష్యంతో కాకినాడ కింగ్స్ బరిలోకి దిగాల్సి వచ్చింది.

# బి.మఠంలో యోగా నిర్వహించని అధికార యంత్రాంగం



బ్రహ్మంగారిమఠం, జూన్ 21, ప్రభాతవార్త:
ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21 వ తేదీన జరుపుకునే విధంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ మరియు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యచరణ చేపట్టిన బ్రహ్మంగారిమఠంలో అందులో ప్రముఖ పుణ్యక్షేత్రంలో యోగాంధ్ర పక్షోత్సవాల ఊసే లేదు ముఖ్యంగా ఆదివారం అనగా ఇంటర్నేషనల్ యోగ డే కార్యక్రమం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టారు అయితే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన బ్రహ్మంగారిమఠంలో అధికారులు ఎలాంటి యోగ డే నిర్వహించలేదని స్థానికులు భక్తులు తీవ్రంగా మండిపడ్డారు ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న క్షేత్రంలో యోగా నిర్వహించి ఉంటే యోగా పట్ల మరింత అవగాహన ఉండేదని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి రాష్ట్ర జాతీయ స్థాయి కార్యక్రమాలను పుణ్యక్షేత్రంగా గావించిన మఠంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

# శ్రీ సౌమ్యనాథ అన్నదాన సేవా ట్రస్ట్ కు విరాళం



నందలూరు, జూన్ 21 ప్రభాతవార్త :
శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్ట్ అన్నదాన పథకానికి కడప పట్టణానికి చెందిన కి.శే. కొప్పోలు యల్లారెడ్డి జ్ఞాపకార్థం భార్య కీపోలు క్రిష్ణమ్మ. 10,116 అందజేశారు. నెల్లూరు పట్టణానికి చెందిన డాక్టర్ భావన, బర్రి కిరణ్ సాయిరెడ్డి 10.116 అందజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్,నెల్లూరుకు చెందిన వి. రాఘవరెడ్డి లు ఒక్కొక్కరు 5 వేల విరాళాలను సౌమ్య నాథ అన్నదాన సేవా ట్రస్ట్ చైర్మన్ యద్దల సుబ్బరా యుడు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె సుబ్రమణ్యం, కొట్టే శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలు తగ్గించాలని నేడు ధర్నా




ప్రొద్దుటూరు క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:
ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎరువుల ధరలు తగ్గించాలని ఏవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం కార్యదర్శి రామ చంద్రారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్న ఎరువుల ధరలు విపరీతంగా పెంచి రైతులు వ్యవసాయానికి దూరమయ్యే విధంగా చేస్తున్నదని ఎరువుల ధరలు తగ్గించాలని దీనిపై ప్రొద్దుటూరులోని ఏవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రతి ఒక్క రైతు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి బి.విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ కార్యదర్శి బి.విశ్వనాథ్, బి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్ నిధులు తో రూ. 78 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం



పీలేరు జూన్ 21 ప్రభాతవార్త:
మండంలోని సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాలకు నూతనంగా రూ రూ. 78 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆర్డబ్ల్యూఎస్ డీఈ శైలేంద్ర తెలిపారు. ఆదివారం పలు వసతి గృహాల్లో నిర్మాణ పనులు పరిశీలించారు. నాలుగు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో రూ.39 లక్షలతో, మూడు బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రూ.39 లక్షలతో మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ అభియాన్ నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇరగన్న పాల్గొన్నారు.

## ఈనెల 30న ప్రొద్దుటూరుకు శృంగేరి పిఠాధిపతి రాక



ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 21, ప్రభాతవార్త
పట్టణంలోని గంగమ్మ దేవాలయం వీధి (పప్పుల బజార్) లోని గంగమ్మ దేవాలయం పునః ప్రారంభము , విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకము కార్యక్రమాలకు కర్ణాటక శృంగేరి శ్రీ శారదా పీఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారు విచ్చేయుచున్నారు. ఆలయ పునః ప్రారంభం, ధ్వజస్థంభ, విగ్రహ ప్రతిష్ట, హోమాలు మహాకుంభా భిషేక కార్యక్రమాలు చేయుటకు శృంగేరి శారదా పిఠాధిపతి స్వామివార్లు విచ్చేయుచున్నట్లు ఆలయ నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి మరియు కమిటి సభ్యులు తెలిపారు.

# ఘనంగా నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి పురస్కారాల ప్రదానం



ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 21, ప్రభాత వార్త
శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక రామేశ్వరంలోని శ్రీ చౌడేశ్వరి దేవి తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంభం పామిలేటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళ, సాహిత్య, సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురిని పురస్కారాలతో సత్కరించారు. సేవా కళారత్న అవార్డును బండారు రఘురామయ్య, సాహిత్య కళారత్న అవార్డును డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ, నట కళా శిరోమణి అవార్డును పి. యశోద, నట కళారత్న అవార్డును పెయ్యల చంద్రశేఖర్ యాదవ్ అందుకున్నారు. అలాగే డాక్టర్ నీలం బాల గంగాధర్ తిలక్, కూచిపూడి నృత్య కళాకారిణి బడిగించల వెంకట యామిని గౌరవ సన్మానాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కంభం పామిలేటి మాట్లాడుతూ కళాకారులు, ప్రోత్సహించడమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బండారు రఘురామయ్య మాట్లాడుతూ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని పేర్కొన్నారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళలు, సాహిత్యం సమాజానికి అద్దం పట్టేవని, యువత సాంస్కృతిక విలువలను పరిరక్షించే దిశగా ముందుకు రావాలని సూచించారు. రంగస్థల నటులు కొత్తపల్లి శ్రీను, పల్లా బాల నరసింహులు మాట్లాడుతూ రంగస్థల కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత సహకారం అందించాలని కోరారు. కళాకారుల ప్రతిభను గుర్తించి సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి కళాభిమానులు, సాహితీవేత్తలు, రంగస్థల కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కలికిరిలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం

కలికిరి, జూన్ 21, ప్రభాతవార్త:
కలికిరి మండలంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంపీడీవో భానుమూర్తిరావు పర్యవేక్షణలో విజయవంతమైంది. కలికిరి మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఈవో అశోక్ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి ఎంపీడీవో భానుమూర్తిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి వేరు చేస్తుందని ఎంపీడీవో తెలిపారు. ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేందుకు ఈ యోగా ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీఓ యోగాసనాలు చేసి అందరినీ ఉత్తేజపరిచారు. మర్రికుంటపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటరమణ, సచివాలయ మహిళా పోలీసు సుజాత, డిజిటల్ అసిస్టెంట్ ఉమామహేష్, ఆర్టికల్చర్ అసిస్టెంట్ బిందులు హాజరై యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. అదే అన్ని సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరగడంతో కార్యక్రమం విజయవంతం అయ్యింది.

## పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద 4.85 కోట్లు విడుదల

దువ్వూరు, జూన్ 21, ప్రభాతవార్త:
మండల పరిధిలోని రైతులకు అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద 4 కోట్ల 85 లక్షల రూపాయలు విడుదల అయినట్లు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 7121మంది రైతులకు 3.56 లక్షలు, అలాగే పీఎం కిసాన్ పథకం కింద 6452 మంది రైతులకు కోటి 29 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ రెండు పథకాల కింద రైతులకు 4.85 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. అయితే అన్నదాత సుఖీభవ పథకం కింద ఎక్కువ ముంది రైతులు లబ్ది పొందగా పీఎం కిసాన్ పథకం కింద 669 మంది రైతులు తప్పినట్లు తెలిపారు. దీంతో అన్నదాత సుఖీభవ పథకానికి, పీఎం కిసాన్ పథకానికి మధ్య 669 మంది రైతులకు లబ్ధి చేకూరలేదని తెలుస్తోంది. పెట్టుబడి సాయం కింద ఈ నిధులను విడుదల చేశారని ఏవో తెలిపారు.